


# డాక్టరు నాయుడు

శ్రీ మంచళ్ల సుదర్శనాచార్యులు

నవమాసములు నిండినవి. నిండుచూలాలి- శరీరమంతా నీరు చూపింది. ఎటు కదలినా బాధ. నెలలు గడచిన కొలది శరీరమంతా పాండువర్ణంగా మారింది. తొలిచూలు కాన్పు గనుక తల్లి దండ్రులు, భర్త, చాల శ్రద్ధ వినియోగిస్తున్నారు. పదిరోజులు గడచి, తల్లిపిల్ల క్షేమంగానుంటే చాలనిచాల ఆందోళనపడు తున్నారు. భగవంతునికి నిత్యము వేయి నమస్కారము లర్పిస్తున్నారు. చిన్నప్పటినుంచి ప్రాణాని కన్న మిన్నగా పెంచినకడుపు కనుక తల్లిదండ్రులును, హృదయ సమర్పణ మొనర్చి పతికన్నమించిన వేరు దైవమేలేదని తలపోయుచున్న ప్రియసఖి గనుక భర్తయును, రాత్రింబవలామె యోగక్షేమములరయుచున్నారు. క్షేమంగా ప్రసవించుటకై గవర్నమెంటు ఆస్పత్రికి తీసికొని వచ్చారు సుభద్రమ్మను.

షోడశ కళాప్రాయుడై త్రయోదశినాటి చంద్రుడు పండువెన్నెల కాయుచున్నాడు. నక్షత్రములు తమనాధునిచుట్టూ చేరి రహస్యంగా మాట్లాడుకొంటున్నవి. నడిరాత్రి కావచ్చింది. అంతా శాంతివంతంగా వున్నది.

క్రిందటి రోజునుంచి ప్రసవవేదనపడుతూ, బాధపడలేక మూలుగుచున్న సుభద్రమ్మకు నిముష నిముషము ప్రసవవేదన మిక్కుటమగుచున్నది. ఏ నొప్పికి పిండము బయట పడుతుందో అదే మొదటిసారి కాన్పు గనుక తెలుసుకోలేక పోయింది. దాదాపు 24 గంటలనుంచి నొప్పి కలుగుచున్నందున, ప్రసవించ గలనని నిశ్చయించుకో లేకపోయింది. ఆమె తల్లి దండ్రులుకూడ గతరాత్రివేళ కంటికి కూర్కులేనందున, యింకా యెన్నిరోజులో యీబాధ మాతల్లికని నిట్టూర్పు విడుస్తూ, ఆలోచిస్తూనే కన్ను మూసారు. గాఢ నిద్రపట్టింది. అప్పటి సంగతి యెవరికే తెలియదు. సుభద్రమ్మమటుకు బాధపడుతూనేయుంది. కొంత సేపయిన తర్వాత పెద్ద నొప్పికి అబ్బా యని అరచి పూరకున్నది. లోననింతవరకు బాధ కలిగించుచున్న పిల్లవాడుదయించాడు. ఆమెకు భారవిముక్తి తోచింది. ప్రసవవేళకు ముందొక అరగంట క్రితమే మందు తాగింది. మందు మహాత్మ్యమువలననో, లేక వేదనా భార విముక్తివలననో మూలుగుడులేక ముక్కటంలేక మైమరచి పడుకుంది.

చుట్టుతా ఉన్న స్త్రీలు సుభద్రమ్మ మూలుగుట చూచి నిద్రా భంగమయిందని తిట్టుకొనే వారు. ఎప్పుడైతే సుభద్రమ్మ మైమరచిందో వారుపీడ వదలిందని ఆవంక చూడకుండా నిద్రాదేవత నాహ్వానించారు.

ఇప్పుడంతా నిశ్శబ్దమే. పుట్టిన పిల్లవాడు మాత్రము కండ్లు తెరుస్తూ, మూస్తున్నాడు. సృష్టి క్రమాన్ననుసరించి అతని కంటినిండా, పడియున్న

చోటంతా రక్తం చింది పడ్డది. ప్రతి గంట గంటకు డ్యూటీతో నర్సు వచ్చి చూచింది. పిల్లవాడు కన బడ్డాడు. మృతుడా సజీవుడా యని పరీక్షించింది. ప్రాణంతో ఉన్నాడు. సుభద్రమ్మ స్థితిని చూచింది. ఆమె అలసి వున్నందున మైమరచి పోయింది. నలు దిక్కులా చూస్తూ పిల్లవాడిని పొత్తి గుడ్డలలో జొన్పి దబా దబా నడచి పోయింది. రాత్రి డ్యూటీలోనున్న డాక్టరు గదివైపు. వెళ్ళగానే డాక్టరు తలుపు తెరచి "ఏమి విశేషం. మన పాచిక పారిందా?" అని ఆతురతో ప్రశ్నించాడు. కొంటె చూపులు చూస్తూ, వెకిలి నవ్వు నవ్వుతూ యీ విధంగా పాచిక పారేటట్టు ప్రయత్నించిన ఘటం సామాన్యమా? డాక్టరు గారూ! మీది అమృత హస్తమండీ. ఏదైనా సరే విచారించి తలిచారంటే జరిగితీరుతుంది. అందుకన్నే తక్కిన డాక్టర్ల మీదకన్న మీమీద నాకు — నాకేమిటి? సివిల్ సర్జనుగారికి కూడ - అమితాభిమానమండి - ఇదిగో పిల్లవాడు. పాప మా పేదరాలు నిద్రిస్తూంది. మీరు యిచ్చిన సలహా ప్రకారం మీపని పూర్తిచేసా సెల విప్పిస్తారా! అంటూ వెళ్లి పోయిందా నర్సు.

ఈ దుర్భర పైశాచిక కృత్యాన్ని కండ్లార చూడలేక శశాంకుడు మేఘాల ముసుగు వేసుకున్నాడు. నక్షత్రాలు ప్రియునితోబాటు దాగుకొన్నవి. నల్లటి మేఘాలు భయంకరరూపం దాల్చాయేమో అన్నట్లు కారు నలుపెక్కినవి. సుభద్రమ్మ మోసిన నవమాసముల గర్భము పరాయివాళ్ళ పాలయింది. ఆమెకు మిగిలింది రక్తసిక్త జీర్ణ వస్త్రఖండములే- కాని వాటి మధ్య పరుండవలసిన లేత దేహము శూన్యము.

* * *

సాయం సమయము. పిట్టలుపారేవేళ. సందె దీపాలు వెలిగించారు. బడిపిల్లలు ధూళిదుమ్ములో ఆడి, కాళ్లుచేతులు కడుక్కుంటున్నారు యిళ్లకు వెళ్ళి లేగలు 'అంబా!' అని అరుచుచు వెంట రాగా ధేనుసమూహములు బారులు బారులుగా తమ యజమానుల యిండ్లకు జేరుకుంటున్నాయి. పద్మినీసతులు ప్రియుని విరహమునకుకోసి, విచారముతో శుష్కించి ఎఱ్ఱ బారిన ముఖములు ప్రపంచమునకు చూపుట కిష్టపడక, ముడుచుకొన్నాయి. కర్షకులు నాగళ్లను, దుక్కెద్దులను మరల్చుకొంటున్నారు. కార్మికులు వెంట గొంపోయిన ఓగిరము నారగించి, పాత్రలను కడుగుకొని, వంటి దుమ్మును దులుపుకుంటూ ఒకళ్ల కొకళ్లు తమ కష్టసుఖాలను చెప్పుకుంటూ వేగంగా వెళ్ళుతున్నారు. మానవతీమణులు తమ భర్తలలసివత్తురని, ఉపశాంతికై వలయు పరికరములన్నిటి నాయత్తపఱచి, మజ్జన భోజనాది కృత్యముల నొనర్చుటకు మల్లుకట్టుతున్నారు. కులటలు తమయింటి యజమానులు బైటికి వెళలుటే తడవుగా విపరీతంగా అలంకరించుకొని వచ్చే పోయేవారిని ఆకర్షిస్తూ నిలువబడ్డారు. గర్భవతులగు భార్యలను అత్తమామల కోర్కెపై పుట్టింట దిగవిడచి, అంతవఱకొక ముహూర్తమేని యెడబాయని ప్రణయలతానిబద్ధప్రేమ జీవులగుట కతన, నుద్యోగపు బనుల యవుసరముకొలది వెళ్లవలసివచ్చి, తమ ముద్దుగుమ్మలనోదార్చి, చుబుకంబు ముద్దాడి, బిగియారు కౌగిలింతల నొక పర్యాయము సదుముకొని, ప్రశ్నింపబడు సంగతుల కన్నిటికి బహు గౌరవముతో, ప్రేమతో జవాబు లొసంగుచు, సంతుష్టపఱచి, వీడలేక వీడలేక భర్తలు బయలుదేరుచుండిరి సాయంత్రమువచ్చు రైళ్లకయి. పొద్దున మొదలు సాయంత్రమువఱకు పాఠశాలాభవనమున విద్యాబుద్ధులను బాలురకు గఱపి, తచ్ఛ్రమవాపు కొనుటకై ఉపాధ్యాయులు సైకత ప్రదేశములగూడి లోకాభిరామాయణమును బ్రసంగించుకొను చుండిరి. స్వాతంత్ర్యోద్యమోపాసకులా వేళ పూరిగమున వేదికనెక్కి వందలకొలది ప్రజలుగల సభలలో నుపన్యసించు చుండిరి. విప్లవకారుల నణచివేయుటకై రహస్య పరిశోధక సంఘము

వారు మాయా ఫకీరుల వేషములో ప్రచ్ఛన్నముగా వేటకుక్కలవలె వాడ వాడలందిరిగి పసిబట్టుచుండిరి. దేవళములలో సంధ్యా మేళములును, జేగంటా వాయిద్యములు, ఆరతులు, భగవన్నామ స్మరణలు జరుగుచుండెను. సంగీత మందభిరుచిగల బాలికలు, ఉపాధ్యాయుడు వచ్చునని, ఆ తురతతో భయముతో వెనుకటి పాఠములను మరవకుండ సరిజేసికొనుచుండిరి. సూర్యుడనుజ్ఞవడసి, నాటి యుద్యోగ పరిమితిని ముగించుకొని విశ్రాంతికై పశ్చిమాద్రిని జేరిన తదుపరి, ప్రకృతికాంత వినిశ్చలయై కైరవప్రియుని రాకకై యెదురుచూచుచు, తొలుత రజనీకాంతను జేరి ఆమె యెప్పుడు ప్రియుని పొత్తునువీడి, ప్రపంచమునకు వప్పగించునో కనుగొన సిద్ధమగుచుండెను. వికసిత వల్లరీ కుసుమ సౌరభయుకుడై ప్రభంజనుడు తన నాయకుడగు లక్ష్మీపుత్రుని ప్రత్యేక ప్రసూన నీరాజముల ద్వారా నాయికా నాయకుల ప్రణయ పుష్ప సౌరభమును ద్విగుణీకృత మొనర్చుచుండెను. మరచితిని- విధ్యుక్త ధర్మములను సక్రమముగా నెరవేర్చిబడలియున్న భాస్కరుని, శైత్యోపచారములను జరుపనెంచి నదీమ తల్లులు తరంగడోలి నుయ్యాల లూగించుచున్నారు. నూతనముగా పునస్సంధాన కార్యము జరుపబడి, తనూ సౌఖ్యమును కొంత వరకు అనుభవించియున్న లేబ్రాయపు యువతులు, భర్తలు శీఘ్రముగా తమవద్దకు వచ్చుటకై ప్రార్థనలు సల్పుకొనుచుండిరి. వర్ణించాలంటే యివేకావు, చాలా వున్నవి- సంధ్యవేళ ప్రతియూర కన్పట్టు విశేషములు.

కమలం దీపం ముట్టించి, పారాడే పిల్లవాడిని ఎత్తుకొని ముద్దాడుతుంది. పిల్లవాడారు నెలల ప్రాయం లోనివాడు. కమలానికి పిల్లవానికి యీషణ్మాత్రమైన ముఖముపోలికలు లేవు. చాయలో కూడా లేదా. తల్లి పచ్చని పసిమి, పిల్లాడు గోధుమ రంగు. తండ్రి పోలిక లేమైనా వున్నాయంటే, తండ్రి ఆకారాన్ని చూడకుండా చెప్పడం కష్టం. అక్రమం కూడానూ. పోలికలు లేనంత మాత్రాన, తల్లి పిల్లాడు వారు కాదనటానికి కూడ సాహసమే. మరి యింతకూ నిజమెంతో దేవుడికే యెరుక.

ఇంతలో కమలం తల్లి అచ్చమ్మ వచ్చింది. పిల్లవాడిని చూచి మురిసిపోయింది. తల్లిని, పిల్లాణ్ణి చూచి ఆనందం పొంగిపోగా-

“కమలం! మొదట నేను చెప్పింది నీకు తలకెక్కలేదు కాని చూడు! ఎంత బాగా ఉన్నాడో వీడు. నేనీ సాహసానికి వొడిగట్టుకోలేను. జీవితపర్యంతం బీదదానిగా బ్రతుకమన్నా బ్రతుకుతానుకాని యీ పాపం చేయలేను. ఒక జాతివాళ్ళమై వుండియు, పరాయి తల్లికీ అన్యాయం చేయడం ధర్మమేనా? పది నెలలు మోసి, కష్టపడి ప్రసవించిన తల్లికి కాకుండా పసికందును విడదీయుట మానవ హత్యకు బాల్పడినట్లు గాదూ? వంశాన్ని ఉద్ధరించుటకు భగవానుడా పుణ్యాదంపతులకు ప్రసాదించిన బాలకుడు అల్లారు ముద్దుగా పారాడుతూ వారికి నేత్రానంద మొనగూర్చుట బదులు మనచే పోషింపబడు టన్యాయమూ! అంటూ మున్నేదో విధంగా వాదించావే! ఇప్పుడా విచారమేమైంది. చంక నెతుకొని ముద్దాడుతున్నావే!

కమలం:-అమ్మా! ఇంకా నాకా భయం తీరలేదు. ముక్కు పచ్చలారని వొక పరాయి పసి[illegible]సిని దొంగతనంగా స్వీకరించి, ధనలక్ష్మికై అర్పణ గావించినాము. తల్లి బిడ్డల నెడబాపాము పాపమా తల్లి ఎంత పరిపించుచున్నదో! నన్నెంత దూషించు తున్నదో? పూర్వజన్మంలో ఏతల్లి పిల్లల నెడబాపానో, యీ జన్మంలో గొడ్రాలిగా బతుకుతున్నా. ఇప్పుడు చేసినపాపము, ముందు జన్మలో యింకెంత దుర్భరంగా పరిణమిస్తుందో స్వీయ మాతృ స్తన్యపానమున కాతురతతో నోరు చాపవలసిన యీపాప, డబ్బాపాలను త్రాగుతున్నాడే! మనమెంత గారాబంగా పెంచి పోషి

స్తున్నావేమి? తల్లి వతువునా? నన్ను నీవొక నిముషం వదలి ఉండగలవ్వా? పోనీ నాచేతవునా? అట్లాగేకదా వీరి సంబంధ బాంధవ్యంకూడా—కానీ మనము రాక్షస కృత్యానికి వెనుదీయకుండా పిల్లవాడి నిలాగు కొని వచ్చాము. ఈ పాపాన్ని నాకు కట్టి కుడుపటానికే కాబోలా సమయములో డాక్టరుకూడ తారసిల్లాడు. డబ్బుకొఱకు దయాదాక్షిణ్యాలు వదిలాడు. మానవ ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించాడు. ఏమిలాభం? ఎంత చేసినా మన కన్నకడు పవుతుందా! పరాయివాడే; అతుకు అతుకే. పెంచుతాము. వీనిచే అమ్మా అని పిలిపించుకుంటాము. కన్నకొడుకు నన్నుపిలుస్తే ఉన్నంత మాధుర్య ముంటుందా! పిలుపులో క్షోభ వినిపిస్తుంది. వెదురులో శబ్దించే గాలిలాగా పిలుపుతో ఆక్రోశన ధ్వనిస్తుంది. మాతృదేవిలో ఉండే సహజ గౌరవ భావము పరిపూర్ణంగా నాలో అనుభవించలేదు. ఎంత మందిని తల్లులు చనిపోతే యితరులు పెంచలేదు. అంతే నా పనికూడా. సంతోషంగా, దిక్కులేనివాడని కరుణతో పెంచుతున్నామా అంటే అదీకాదు. మన అవుసరానికి తెచ్చాము. ఒకరిని సాధించుతామని పెంచుతున్నాము. కాని మనసాధింపు కొనసాగుతుందా? ఈ ఘోరకృత్యానికి భగవంతుడు మనలను కాల్చి చంపకుంటాడా? చివరకు రెంటికి జెడ్డరేవడి మాదిరి అవుతుంది నాబ్రతుకు లోకగర్హితంగా యీ దుర్మార్గము బయట పడుతుంది. అందరూ నిందిస్తారు. ఐహికాముష్మిక సౌఖ్య నాశనానికి కారణమౌతుంది. ఇప్పుడు చేయిజారి పోయింది. మరల యీ పిల్లవానిని, వాని తల్లిదండ్రుల కొప్పగించుదామన్నా, యెక్కడ ఉంటారో? పోనీ వెతకి ఒప్పగించుతామంటే వారానందిస్తారో లేక వెల్లడిచేస్తారో? ఇంట్లో ఉంచుకుందామంటే, వీనిని చూడంగానే అదోవిధంగా మనస్సు కలతపడుతుంది. నిముషంసేపు తీరికగా చూడలేను. ఇతనితల్లికి కలిగే గర్భశోకము అనుభవమౌతుంది. ఎప్పుడూ వీడు చంకలో నిలువడు. క్రిందికి దిగి పారాడుతాడు. ముందుముందు నామీద తల్లి గౌరవముండదు అనుకుంటాను. ఆ విపరీత పరిస్థితులే గనుక పరిణమించినాయంటే ఆత్మవంచనకాదూ! అంతకన్నను మరొకదుఃఖము, ఆశాభంగము ఉండబోతుందా? ఆత్మహత్యమేలు దానికన్న. ఎన్నటికైన చెడ్డపని దాగుతుందా! వస్తుతః నిర్మాణములోనే ఉల్లి కెన్ని పొరలున్నా దాని వాసన కొట్టుతూనే వుంటుంది. ఆవిధంగా చెడుకార్యమును దాచుట కెన్ని పాట్లుపడినా అది ఎప్పుడో యొకప్పుడు గుప్పుమనక మానదు. ఏమో! మనలో దారుణ వ్యధకల్పించి భగవంతుడే అంతర్యామితో తప్పొప్పించుకొనచేయకుండునా? అప్పుడు మనగతి యేమి కావలసియుండును. ప్రతిజీవి, దుర్బోధన విషయములో శ్రద్ధతో చెవియొగ్గినంత, సత్కార్యము పట్ల కన్పఱచదు. ఒక్కసారికి మంచిపేరు తెప్పించుకొంటానికి, ఎంతో స్వభావ విలక్షణము, ఆదర్శక జీవితము, పరోపకారము, శాంతము, అవ్యాజానురాగము, మొదలగు సద్గుణజాలము కావలసియుండును. కాని చెడ్డపేరున కెంతోసేపు శ్రమపడ నక్కరలేదు. మానవ స్వభావమున కేమాత్రము విరుద్ధముగా చరించినప్పటికి కరతలామలక మగును. ఏవో నీ మాటలువిని నేనిట్టి అకృత్యమున కొడికట్టుకొంటినేగాని నాయిప్పటి ఆందోళన, ఆ ఘాటము, మనోదౌర్బల్యము చూచుకొనిన నొక ముహూర్తముసేపైన స్థిమితముగా, సంతోషముగా నొకచోట నుండలేనని తోస్తుంది.

అచ్చమ్మ:-ఓసి వెర్రిదానా! ఈపాటికే యింత తపన పడుతున్నావే ఘోరహత్య లొనర్చువారి సంగతి యేమంటావు? శిశురక్షణ చేస్తునావే కాని చంపడము లేదుగా! ఆరాటపడకు; సర్వము సక్రమముగా ముగుస్తుంది. లే యిక్కడినుంచి. ఇవ్వాళ శాంతమ్మగారి యింట్లో వాళ్ళ పిల్లవాని పుట్టిన

రోజు పండుగట; మరచా ఇందాక నిన్ను ముత్తైదు పేరంటానికి పిలిచారుగా! వెళ్లుదాము పద.

(ఇరువురూ వెళ్ళారు.)

* * *

విన్న ప్రతివాళ్లకి సుభద్రమ్మకాన్పు విషయమై ఆశ్చర్యం కలిగింది. పూర్వ మెన్నడు కనివిని యెఱుగని యీవింత సంగతి నిజమోకాదో అని కొందిరికి సందేహాము, మృతపిండము కలిగినప్పటికి, తల్లి మైమరచి నిద్రించుచున్నప్పుడు ప్రక్క నుండవలసినది బదులు శుష్క జీర్ణ వస్త్రములుండుట కేమి హేతువో అని అనుమానము, యీ విషయమై మాట్లాడక నూరకుండుటకన్న పోలీసువారికి తెలిపి, యేదో అంతు తేల్చుకుంటే నిజస్థితులు బయటపడగలవని కొంత ఆలోచన గలవారికి ఆతురత కలుగు చున్నవి. క్రమశః యిది చుట్టు ప్రక్కలంతా ప్రాకిపోయింది వారు వీరు చాల మంది సుభద్రమ్మ భర్తకు, తల్లిదండ్రులకు నిజ పరిస్థితులు విచారించు కొనవలసినదని బోధించారు. మొదట మొదట వారు తమ దురదృష్టానికి కుములుచు ఉపేక్షించినారు కాని నలుగురు చెప్పుటబట్టి వారునూ దిగారు పరిశోధన సలుపడానికి.

సుభద్రమ్మ ప్రసవించుచున్నప్పుడున్న డాక్టరుకు ట్రాన్స్ఫరు ఆర్డర్సు వచ్చినవికాని యింకా రిలీవరు రానందున పదిపదిహేనురోజులు గడువు కలిగింది. తానుచేసిన కృత్రిమకార్య మెచట నెపుడెవరి మూలకముగా బయటపడుతుందో అని నిత్యము కంపిలుచుండేవాడు. తనతో భాగము పంచుకొన్న వ్యక్తి నర్సు మాత్రమే అది యితనికి అనుంగు స్నేహితురాలు. ఏ విషయముల్లోనూ యిరువురొక్కరే-వారిలో వారికి ఆంతరంగిక రహస్య విషప్రసంగమేకాని వారి సంబంధ మితరుల కెవరికి తెలియదు. అంత గోప్యముగా ప్రాణముకన్న నెక్కువగా తనతో మెలగుచున్న నర్సు బయటపెట్టుతుందా? అందులో దోషభాగస్వామిని అయినది వెల్లడిబుచ్చ గలదా? తనకు అపనిందేగా-తన పెట్టుకూడ మునుగుతుందిగా! ఇక వీరిరువురు మినహా బ్రహ్మాంతవాడికికూడ యీ విషయమై తెలియదు అట్టిసమయములో డాక్టరున కేమిభయము? ఇతరులకు తెలియకపోయినా, అతనిఅంతరాత్మ సందడిచేస్తూనే యుంది. దోషపూరిత హృదయునికి శాంతిశూన్యము. ఎప్పు డీ సంగతి తలచుకొన్నా, నదమల కుంకుమరేఖా విలసితమగు సుభద్రమ్మ అమాయకపు వదనబింబము ప్రత్యక్షమవుతుం దతని మనోదృష్టికి. తల్లిని, పసిపాప నెడబాపిన కొండంత పాపము తలకు చుట్టుకుంది. తనకును పిల్లలు కలిగారుగదా! తనకు వారిమీద ఎంత అనురాగం, ప్రేమశ్రద్ధలు కలవు. సమ్మోహనాస్త్రాకార సన్నిభములగు ధనలక్ష్మి కనుచూపు కోలలకు దాసోహమ్మనుటచేతనేకదా యిట్టి భయంకర కృత్యమున కొడిగట్టుకున్నది. ఇంక నాతనికి గుండెదిటవు ఎటనుండి కలుగగలదు.

నర్సున కీ విచారము లేకపోలేదు. అయినా డాక్టరు నెత్తిన సర్వముతోసివేస్తే తన భారము తీరుతుందనుకొని అంతగా అవస్థపడుటలేదు. తాను డాక్టరు అధికారము క్రిందనున్నప్పు డేపని చెప్పినను చెయ్యకపోయిన నుద్యోగరీత్యా అవిధేయతగా పరిగణింపబడునుగదాయని తలచుచుండేది. కాని ఉద్యోగమునకును, దైవప్రేరిత పవిత్రమానవ జీవిత పరిణామమునకెంతయేని వ్యత్యాసమున్నదని యెఱుంగలేక పోయినది. నర్సు మనస్సులో అంధకార మేఘవిడంబనమేకాని జ్ఞానోదయము శూన్యము. పశుప్రాయముగా జీవించుచున్న ప్రాణి. ఇట్టి వారివలననే భారత సౌభాగ్యలక్ష్మి కొల్లలుగా కొట్టుకొన పోబడుచున్నది గదా.

దోషి యెవరైనదియు, యెవరిమూలమున నిట్టి విచిత్రదారుణ సంఘటనము జరిగినదియు జాడదీయుటకై పరిశోధనలు జరుపబడుచున్నవి. సుభద్రమ్మ ప్రసవించు

నాటిరాత్రి యెవరు డ్యూటీలోనున్నది, అతని స్వభావమెట్టిదియో, అతనికీ సంగతిని గురించి యేమైన ఎరుకనున్నదియు, ప్రతిరోజు రాత్రి సమయములందు తన డ్యూటీలో తగుజాగ్రత వహించుచున్నది, లేనిది మొదలగు విషయములను కనుక్కొంటున్నారు పోలీసులు. మన డాక్టరు నడిగిరికాని ఛిటికెలో తనమీద ఏమాత్రమనుమానములేకుండ చేయవచ్చును లెమ్మనుకొని పొరపాటు పడ్డాడు. నర్సునుకూడ బయటపెట్టవద్దని ప్రార్థించుకున్నాడు. ఎంత కట్టుదిట్టములు చేసుకున్నను రహస్యము తప్పక తెలియగలదనే ఆత్మబోధనము కలవరపరుస్తుంది. సుభద్రమ్మకు ప్రసవకాల సమయమునకు మృతపిండోత్పత్తి అయినదియు, లేక జీవపిండోత్పత్తి అయినదియు పెద్దడాక్టరు సూక్ష్మవైద్య పరికరముల మూలమున పరీక్ష చేసినాడు. అతని కామె గర్భాశయమునం దేలాటిదోష చిహ్నములు కనవడలేదు. ఆయనకును తలయెత్తకుండా ఉండేటంత అపకీర్తికలుగుటవలన నీ విషయములో చాలా శ్రద్ధవహించుచున్నాడు. నిజము తేలాలని గట్టిగా పట్టుపట్టాడు. పోలీసువా రడిగినప్పుడు సుభద్రమ్మకు మృతపిండము కలుగుట కేలాటి హేతువునూ శరీరస్థితి రీత్యా లేదనియు, అయినా ఎట్టి పిండము కలిగినను దానిని తల్లిదండ్రులకు చూపనిదే, వారి అనుమతిలేనిదే, బయటపారవేయుట న్యాయవిరుద్ధమనియు సాఫ్‌సీదాగా తన అభిప్రాయాన్ని తెలిపినాడు.

ఎప్పుడైతే తన అధికారి నిశ్చితాభిప్రాయాన్ని తెలిపాడో, పోలీసువా రందుమూలమున తననే అనుమానించినారో, అప్పటినుంచి మన డాక్టరుగారికి ఏమీ పాలుపోవుటలేదు. తల్లక్రిందు లవుతున్నాడు. ఏమి సమాధానము చెప్పవలయునో ఊహించ లేకపోయినాడు. ఎటులైనను నేరము తనమీద మోపబడగలదనియు, తద్వారా తనకుకలుగు దుర్యశము ఎంతటిపాప భూయిష్టము అగునదియు ఊహించుకొని ఆత్మహత్యకు పాల్గొనినాడు. స్వప్రాణహత్యకు బూనుకొనుటకు ముందు యీ కేసు విషయములో జరిగిన వాస్తవమంతా బయటబెట్టినదే మంచి దనుకొని ఒక ఉత్తరము వ్రాసి తలక్రింద పెట్టుకొని విషము త్రాగినాడు.

మరునాడు డాక్టరు భాస్కరరావునాయుడుగారింటి ముందర చాలామంది చేరారు. క్రితం సాయింత్రము హాస్పిటలుకు వెళ్లి మొద్దులాగా ఉండినవానికి అకస్మాత్తుగా మరణమేమిటాయని ఆశ్చర్యపడ్డారు. కొంతమంది యిప్పుడు విపరీత నవనాగరికతా పిశాచచేష్టల ఫలితముగా ప్రతివాడుగుండె ఆగిపోయి చనిపోవుచున్నట్లు డాక్టరుకూడ దాని వలననే మరణించెనేమో అని అనుమానపడ్డారు. చివరకు సివిల్ సర్జనుగారు తయారయ్యారు. ఆయన పరీక్ష చేసే టప్పటికి నాయుడుగారి ప్రతి నాడిలోనూ విషం కనుపడుతుంది. విషం త్రాగి చచ్చాడని నిర్ధారణ చేసారు. ఈ సంగతిని వినంగానే అందరికి సందేహం కలిగింది. శవాన్ని భూశయనానికి లేవనెత్తారు. తలగడక్రిందనొక ఉత్తరము నాయుడుగారి స్వహస్త లిఖితమైనది దొరికినది. దానిని విప్పి చదివాడు పెద్దడాక్టరు.

"రక్షక భటశాఖాధ్యక్షా!

షుమారు ఆరునెలల క్రిందట నొక పల్లెటూరి పడుచు ప్రసవవేదనతో మా ఆస్పత్రికివచ్చి, చేర్చుకొనబడినది. కాని తరువాత రెండు మూడు రోజులకొక భాగ్యవంతురాలు తన కెవరినైనా పిల్లవాడి నెవరికి తెలియకుండా యిప్పించితే బహుమానం క్రింద ఆరువేల రూపాయీల నిస్తాననియు, చాల రహస్య విషయమనియు, నా కాశ పెట్టినది. డబ్బున కాశపడి నేను మానవత్వాన్ని వదలి, మిస్ జోన్సు అనే నర్సుద్వారా పై పల్లెటూరి పడుచుకు మైకము కలుగజేసే మందిచ్చి పిల్లవాడిని సంగ్రహించి, భాగ్యవంతురాలికి యిచ్చి, ఆరువేలరూప్యములను తీసుకొన్నాను. ఆ భాగ్యవంతురాలిపేరు అచ్చమ్మ

అని నాకు జ్ఞాపకము. ఆమెదీయూరే అనివిన్నాను. అచటికివెళ్లి, పిల్లవానిని తెచ్చి, తిరిగి స్వంతతల్లికి ఒప్పచెప్పగలరు. నా ఆజ్ఞానుసారము నడచినది గనుక నర్సును వదలిపెట్టగలరు. ఆమె దోషమేమియులేదు ఈ ఘోరకృత్యమునకు నేనే కారకుడను. తల్లి బిడ్డల నెడబాపాను. అందుకే యిప్పుడునాకును, నా ప్రేమాస్పదులగు చిన్నబిడ్డలను, అనుంగు ప్రియురాలిని భగవంతుడెడబాపు చేయుచున్నాడు. నాదోషమింతకాలము రహస్యముగా నుంచబడినది. కాని అది యిప్పుడు బయటపడినది. అట్లగుట మంచిదే నలుగురు నన్ను నీచునిగా చూడకుండ, గవర్నమెంటువారిచే నరకబాధలు పడకుండా యీవిధంగా విషంత్రాగి మరణమునకు పాల్పడినాను. నా మరణము విషయమై నాభార్యాపిల్లలకిందేమి జోక్యములేదుగాన వారిని బాధింపవలదు.

సెలవు.

— భాస్కరరావునాయుడు

చదివినంతసేపూడాక్టరుకు ఆశ్చర్యము పట్ట శక్యముగాకుండా నున్నది. దానిని వెంటనే పోలీసు సూపరింటెండెంటుకు పంపినాడు. పోలీసువారు అచ్చమ్మ యిల్లెచటనో వాకబుచేసి పిల్లవాని జాడనడిగారు. మునలది అబద్ధాలకు దిగినా, యిదివరకే మనోవ్యధనందుచున్న కమల పిల్లవానినితెచ్చి పోలీసువారి కప్పగించి క్షమాపణ కోరుకున్నది. తప్పుచేసికూడ యింకా బింకాలకు చస్తున్నది గనుక అచ్చమ్మను ఎరెస్టుచేసి లాగుకొని పోయినారు.

* * *

మళ్ళీ సుభద్రమ్మ కడుపు చల్లబడింది. పిల్లవాడిని చూచుకొని మురుసుకుంటూంది. తన పెన్నిధానము, తన నవమాస కష్టఫలము, తన వంశోద్ధారకుడు, దొరికినాడని వేయిదేవుళ్ళకు మ్రొక్కుకుంది.

ఒకనాటి రాత్రి సుభద్రమ్మ 'దాయి దాయి చందమామా?' అని పిలుస్తూ పిల్లవాడికి గోరు ముద్దలు పెట్టుతూంటే బాగున్నావా అని అడిగింది తరువాత స్నేహితురాలగు కమలం పిల్లవాడెంత చక్కగా, కుదురుగా తల్లి చంకలో కూర్చొని గోరుముద్ద లందుకుంటున్నాడో చూచి ఆనందించి సంతోష బాష్పాలు రాల్చింది.

కాని మనస్సులో "అతుకు అతుకేగా" అని యిదివరలో అనుకున్నది స్ఫురించి, అది యిప్పుడు దృష్టాంతంగా కనిపించినందుకు తృప్తిపడింది.


## హస్తరేఖాశాస్త్రము



విశదముగా తెలియగల 300 చిత్రములతోగూడి స్త్రీలు బాలురు సైతము చదువుట కనుకూలించు తేట తెల్లంమగు సాంధ్ర వచనరూపమగు నీగ్రంధముచేత ఆయుస్సు వివాహలాభము, గుణము, శక్తి, బుద్ధి అదృష్టము, సంతానము లౌకిక సుఖము వ్యాజ్యము. శక్తి ఐశ్వర్యము, గండము, జయము, వ్యాధి, ఋణము, అపాయము మోసము, జ్ఞానము, దుఃఖము, కార్యసిద్ధి, దయ మరణము మొదలగు ననేక విషయములను సులభముగా దెలిసికొన వచ్చును. ఇంకను, విధిప్రేరణము, జీవిత రహస్యములను తెలియజేయుటకై గల్గు సాధనంబు లన్నింటిలోను యిది యగ్రస్థానంబును వహించియున్నది. భూత భవిష్య ద్వర్తమానంబులని చెప్పబడు త్రికాల వృత్తాంతంబులను దెలియుటకు ఈ గ్రంథము కల్పవృక్షము వంటిదని దీని సాముద్రాలాగ్రము ఒక్కమారు చదువువారే చెప్ప సాహసింతురనుట కెంతయు సందియంబు లేదు. దీని వెల 2-0-0.

సౌకారుపేట, ఆనందబోధిని ఆఫీసు. మదరాసు.